
ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు


పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

- ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేస్తున్నాం : జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే వినతులు, సమస్యలను ఆన్‌లైన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని రథాలపేట సెంటర్‌లోని అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారు చెప్పే సమస్యలు, ఇబ్బందులను ఆలకించి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ప్రతి అర్జీనీ ఆన్‌లైన్ చేసి రశీదును అందజేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వినతులపై సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారం ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్లస్థలాలు, ఆక్రమణల తొలగింపు, ఉపాధి కల్పన, సదరమ్ సర్టిఫికెట్ల జారీ తదితర వ్యక్తిగత అంశాలతోపాటు నివాస ప్రాంతాల్లో సమస్యలపై ప్రజల నుంచి 198 వినతులు అందాయి. పీజీఆర్ఎస్‌లో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎల్‌డీవో కేఎస్‌వీ ప్రసాదరావు, పిఠాపురం మునిసిపల్ కమిషనరు కనకారావు, తహశీల్దారు వీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా 30వ వార్డు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డ్రెయిన్ నిర్మాణం చేపట్టి సగంలో నిలిపివేశారని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని కె.మణి, కె.నాగులు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. నిర్మాణం తక్షణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

శాశ్వత పరిష్కార దిశగా చర్యలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతివారం ప్రజల నుంచి అందుతున్న అర్జీలను శాశ్వత పరిష్కారం అందించే దిశగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కార పురోగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై ప్రత్యేక దృష్టిపెట్టి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మొత్తం అర్జీలను పర్యవేక్షించేందుకు డీపీఎం ఎస్డీసీ నోడల్ అధికారిగా ప్రత్యేక బృందాన్ని నియమించడం జరిగిందన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి జేసీ నేతృత్వంలో జిల్లా రెవెన్యూ అధికారి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జేసీ రాహుల్‌మీనా

అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి : జేసీ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జేసీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ హాల్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీలను ట్రైనీ కలెక్టర్ భావన, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్‌లు మొత్తం 429 అర్జీలను స్వీకరించారు.


పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

పోలవరం పరుగు

- 2026కి పూర్తి కావాలని ఆదేశం
- షెడ్యూల్ ప్రకటించిన బాబు
- మూడు రోజులు రాక్ పరిశీలన
- సీఎంకు కట్టుదిట్టమైన భద్రత
- పోలవరం సిబ్బందికి అనుమతిలేదు
- పూలబొకేల నిరాకరణ
- సీఎం చెంత ఈఎన్‌సీ, సెక్రటరీ, సీఈ

రాజమహేంద్రవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఇక పరుగులు పెట్టనుంది. సీఎం నారా చంద్రబాబునాయుడు స్వయంగా ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి పూర్తి చేయడానికి షెడ్యూల్ ప్రకటించారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు ప్రజల్లో కూడా ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం ఏర్పడింది. సీఎం చంద్రబాబు స్వయంగా పనులు పరిశీలించడంతోపాటు అనేక విషయాలు ఆరా తీశారు. వ్యూపాయింట్ నుంచి స్పిల్‌వే, దానికి అవతల ప్రాజెక్టు కట్టబోయే ప్రాంతాన్ని పవర్ ప్రాజెక్టు పనులు పరిశీలించారు. తూర్పుగోదావరి వైపు జరుగుతున్న పవర్ ప్రాజెక్టును సీఎంకు ఈఎన్‌సీ చూపించడంతో అంతేనే ఇంకా ఎత్తు ఉంటుందా అని సీఎం అడగడంతో అంతేనని అధికారులు చెప్పారు. ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మించే ప్రాంతానికి చేరుకుని, అక్కడ జరుగుతున్న శాండ్ ఫిల్లింగ్, డయా ఫ్రంవాల్ నిర్మించే ప్రాంతంలో వైబ్రో కాంపాక్షన్, దిగువ కాఫర్ డ్యామ్ ప్రాంతం తిలకించారు. ప్రాజెక్టు మీద అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే సమయం గురించి అధికారుల సమీక్షలో చంద్రబాబు ఆరా తీశారు. 2027కి పూర్తి చేస్తామని అధికారులు చెప్పగా 2026 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు సివిల్ పనులు 2026 మేనెల, జూన్ నెలల నాటికి పూర్తి చేస్తే ఒక సీజన్ కోల్పోకుండా ఉండవచ్చన్నారు. 2026 నుంచి ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండేలా చూడాలని చెప్పారు. మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ రూ.12,157 కోట్లు ఖర్చుచేయగా అందులో రూ.2,345 కోట్లు కేంద్రం ఇచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7 లక్షల 27 వేల ఎకరాల ఆయకట్టు కొత్తగా సాగులోకి వస్తుందన్నారు. గత ఐదేళ్లలో నిర్వీర్యమైన ప్రాజెక్టుకు చంద్రబాబు రాకతో కళ వచ్చినట్టయింది.

బాబు వచ్చారు..కళొచ్చింది..


సీఎం చంద్రబాబుకు ప్రాజెక్టు పనుల తీరును లాప్‌టాప్‌లో చూపిస్తున్న సిబ్బంది

భద్రత కట్టుదిట్టం..

సీఎం పర్యటన భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎవరినీ సీఎం చెంతకు వెళ్లనీయలేదు. కనీసం నాయకులను పూలబొకేలు ఇచ్చేందుకు అనుమతించలేదు. తప్పని పరిస్థితుల్లో నాయకులు ఒకటి రెండు పువ్వులను ఇచ్చి సీఎంకు స్వాగతం పలికారు. సుమారు 800 మంది పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. కనీసం ఇరిగేషన్ ప్రాజెక్టులో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న అధికారులను సీఎం వద్దకు వెళ్లకుండా రాజమహేంద్రవరానికి చెందిన ఓ డీఎస్పీ అడ్డుకున్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు అసహనానికి గురయ్యారు. సీఎం వద్దకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతోపాటు ఇరిగేషన్ సెక్రటరీ, ఈఎన్‌సీ, సీఈలను మాత్రమే అనుమతించారు. మ్యాప్ చూపినపుడు, ఫొటో ఎగ్జిబిషన్‌లో కూడా సీఎంకు ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు వివరించి చెప్పారు. కనీసం వినతులివ్వడానికి ప్రజలను సీఎం చెంతకు వెళ్లనీయ లేదు. అది గమనించిన సీఎం వెనక్కి వచ్చి వినతులు తీసుకున్నారు. ఇతర ప్రజాప్రతినిధులకు వచ్చే డౌట్లు తీర్చడానికి ప్రాజెక్టులో పనిచేసే అధికారులు అందుబాటులో లేక ఇబ్బందిగా మారింది.

నేటి నుంచి రాక్ పరీక్షలు

ప్రధాన డ్యామ్ ఎర్త్‌కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) నిర్మాణానికి చాలా రాక్ (రాయి) అవసరం ఉంటుందని, ఎక్కడెక్కడ ఏ రాయి ఉందో ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చంద్రబాబుకు తెలిపారు.ఇక్కడ పనులకు అవసరమైన అనుమతులు పొందవలసిన అవసరం గురించి సమీక్షించారు. ముఖ్యంగా రాళ్ల నాణ్యతను పరిశీలించడానికి మంగళవారం ఒక నిపుణుల కమిటీ రానుంది. మూడు రోజులపాటు ఇక్కడే ఉండి, పలు రకాల రాళ్ల పరీక్ష చేస్తారు.


చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

4 గంటలు ఇక్కడే..

ఉదయం సుమారు 11.45 గంటలకు హెలికాప్టర్ దిగిన వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతంపలికారు. మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు గులాబీ పూలతోనూ, పసుపురంగు పూలతోనూ స్వాగతం పలికారు. సుమారు 4 గంటలపాటు ప్రాజెక్టు ప్రాంతమంతా కలియతిరిగారు. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకట్రాజు, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి, కలెక్టర్లు పి.ప్రశాంతి, వెట్రి సెల్వి, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చంద్రబాబుకు పువ్వులు ఇస్తున్న బీవీఆర్ చౌదరి

రేపు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం (డీఆర్‌సీ) కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈడీఆర్సీ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరు నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ ఏకసభ్య కమిషన్ సభ్యుడు పర్యటన

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్‌రంజన్‌మిశ్రా ఈనెల 18,19 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న ఉదయం 11 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి మీటింగ్ హాలులో వినతిపత్రాలు స్వీకరించనున్నారు. షెడ్యూల్ కులాలకు సంబంధించి వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి వినతులు స్వీకరించి తదుపరి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు.

శాంపిల్స్ ఫలితాలు నేడో రేపో విడుదలకు అవకాశం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): స్టెల్లా ఎల్ నౌకలో ఈనెల 4వ తేదీన సేకరించిన 36 బియ్యం శాంపిల్స్ ఫలితాలను మంగళవారంగానీ, బుధవారంగానీ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ మేరకు కలెక్టరేట్ వర్గాల ద్వారా సమాచారం తెలిసింది. కలెక్టర్ షాన్‌మోహన్ విలేకర్ల సమావేశం నిర్వహించి శాంపిల్స్‌లో పీడీఎస్ రైస్ ఆనవాళ్లు ఉన్నాయో లేవో ప్రకటించనున్నారు.



పిఠాపురం సీహెచ్‌సీ ఇక

ఏరియా ఆసుపత్రి!

- 30 నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం
- 66 అదనపు పోస్టులు మంజూరు
- స్పెషలిస్టులు సహా 23 మంది వైద్యులు
- రూ. 38.32 కోట్లు కేటాయింపు
- డిప్యూటీ సీఎం పవన్ చొరవతో నాలుగు దశాబ్దాల కలకు సాకారం

(ఆంధ్రజ్యోతి- పిఠాపురం)

ప్రజలకు సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(ప్రభుత్వాసుపత్రి) 30 పడకల నుంచి 100పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీచేసింది. వైద్యులు, వివిధ విభాగాల సిబ్బందితో కలిపి అదనంగా 66 పోస్టులు, అప్‌గ్రేడ్‌కు అవసరమైన సదుపాయాల కల్పనకుగానూ రూ.38.32 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో నాలుగు దశాబ్దాలుగా ఉన్న పిఠాపురం నియోజకవర్గ ప్రజల కల నేడు నెరవేరుతోంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు పిఠాపురం, పత్తిపాడు, తుని, కాకినాడ రూరల్, పెద్దాపురం నియోజకవర్గాల పరిధిలోని సుమారు 120 గ్రామాల నుంచి పిఠాపురం పట్టణంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రజలు వైద్య అవసరాలు నిమిత్తం వస్తూ ఉంటారు. నిత్యం ఓపీకి రోగుల సంఖ్య 300 నుంచి 500 వరకూ ఉంటుంది. డెలివరీలు, సిజేరియన్లు అధికంగా జరుగుతుండడం, సమీపంలోని పీహెచ్‌సీల నుంచి రిఫరల్ కేసులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఆసుపత్రిలో సౌకర్యాలు సరిపోవడం లేదు. సీహెచ్‌సీలో అధికారికంగా ప్రస్తుతం 30 పడకలు మాత్రమే ఉన్నాయి. కొవిడ్ సమయంలో దాతల సహకారంతో సమకూర్చిన బెడ్‌లు, ఇతరత్రా వచ్చిన బెడ్‌లు కలిపి మరో 30 పడకలు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. అవుట్, ఇన్‌పేషెంట్‌ల సంఖ్య గణనీయంగా పెరిగినా వైద్యులు, సిబ్బంది సరిపడా లేకపోవడంతో వైద్య సేవలు అందించడం ఇబ్బందికరంగా మారింది. పవన్ దృష్టికి ఈ విషయం వెళ్లడంతో అదనంగా ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక స్టాఫ్ అటెండెంట్‌ను నియమించారు. సీఎస్ఆర్ నిధులతో ఎక్స్‌రే ప్లాంటును అందుబాటులోకి తీసుకువచ్చారు. కొంతవరకూ ఇబ్బందులు పరిష్కారమయ్యాయి.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ..

పిఠాపురం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో, విజయం సాధించిన తర్వాత, డిప్యూటీ సీఎం హోదాలో ఇక్కడ నిర్వహించిన సభలో పిఠాపురం సీహెచ్‌సీ (ప్రభుత్వాసుపత్రి)ని కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతానని, 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే దిశగా త్వరితగతిన అడుగులు వేసేలా పవన్ చేసిన కృషితో గత నెల 6న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆసుపత్రి అప్‌గ్రేడ్‌కు ఆమోదం లభించింది. ఇప్పుడు 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేస్తూ జీవో జారీ అయింది. అప్‌గ్రేడ్ కానున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన 6-7 లక్షల మంది ప్రజలకు అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.

వైద్యుల పోస్టుల మంజూరు ఇలా..

100 పడకల ఏరియా ఆసుపత్రిగా మారనున్న పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి అదనంగా 66 పోస్టులు మంజూరుచేశారు. ఇందులో స్పెషలిస్టు వైద్యులు సహా అన్ని రకాల వైద్యుల పోస్టులే 23 ఉన్నాయి. స్టాఫ్‌నర్సుల పోస్టులు ప్రస్తుతం ఆరు ఉండగా, ఈ సంఖ్య 24కి పెరగనుంది. వైద్యుల పోస్టులకు సంబంధించి జనరల్ మెడిసన్, సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఎనస్థీషియా విభాగాల్లో ఒకటి వంతున సివిల్ సర్జన్ స్పెషలిస్టు పోస్టులు, ఒక సివిల్ సర్జన్ ఆర్ఎంవో, గైనకాలజీ, జనరల్ మెడిసన్ విభాగాల్లో డిప్యూటీ సివిల్ సర్జన్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ జనరల్ పోస్టులు మూడు, జనరల్ మెడిసన్, సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఎనస్థీషియా, ఈఎన్‌టీ, అప్తమాలజీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ, పాథాలజీ విభాగాల్లో ఒకటి వంతున సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, డిప్యూటీ డెంటల్ సర్జన్ పోస్టులు ఉండనున్నాయి. స్పెషలిస్టుల వైద్యులతోపాటు సాధారణ వైద్యులు అందుబాటులోకి ఉంటారు. ఇక సిబ్బందికి సంబంధించి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 పోస్టు ఒకటి, నాలుగు హెడ్ నర్సులు, 24 మంది స్టాఫ్ నర్సులు, ఒకటి వంతున రేడియోగ్రాఫర్, ఫార్మసీ సూపర్‌వైజరు, ఫార్మసిస్ట్ గ్రేడ్-1, మూడు ఫార్మసిస్టు గ్రేడ్-3 పోస్టులు, నలుగురు థియేటర్ అసిస్టెంట్లు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు, మూడు డార్క్ రూమ్ అసిస్టెంటు పోస్టులు మంజూరయ్యాయి. ఏరియా ఆసుపత్రికి మొత్తం 96 పోస్టులు మంజూరు చేయగా, ప్రస్తుత సీహెచ్‌సీలో వైద్యులతో కలిపి 30 మంది మాత్రమే ఉన్నారు. దీంతో అదనంగా 66 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, ప్రమోషన్, అవుట్ సోర్సింగ్‌లో భర్తీచేయాలని సూచించింది.

భవనాలు, మౌలిక వసతులు

సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా అదనపు భవనాలు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం మాతా శిశు విభాగం బ్లాక్ మాత్రమే వినియోగానికి అనువుగా ఉంది. పురుషుల ఇన్‌పేషెంట్ బ్లాకులు శిథిలావస్థకు చేరినా వాటికి మరమ్మతులు నిర్వహించి వినియోగిస్తున్నారు. అదేవిధంగా ఓపీ బ్లాక్‌లో ఐదుగురు వైద్యులు మాత్రమే ఓపీ చూసేవీలుంది. ఈ నేపథ్యంలో 23 మంది వైద్యులు ఓపీ చూసేవిధంగా బ్లాకు నిర్మాణంతోపాటు 100 పడకలకు అనువుగా ఇన్‌పేషెంట్ల బ్లాకుల నిర్మాణం, ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటు, ల్యాబ్, స్కానింగ్, ఎమ్ఆర్ఐ ఇతర అత్యాధునిక పరికరాల ఏర్పాటుకు మరో బ్లాకు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీటి నిర్మాణానికి, సదుపాయాల కల్పనకు రూ.34 కోట్లు నిధులు మంజూరు చేసినా చేపట్టి పూర్తి చేసేందుకు సమయం పడుతుంది. ఈలోగా ఏరియా ఆసుపత్రిని ప్రస్తుతం అందుబాటులో ఉన్న భవనాల్లోనే ప్రారంభించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. వైద్యులు, సిబ్బంది నియమాక ప్రక్రియ పూర్తికి రెండు, మూడు నెలల సమయం పడుతుందని, ఈలోగా సర్దుబాటు ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించి సేవలు అందుబాటులోకి తీసుకువస్తారని సమాచారం. ఏదిఏమైనా ఇచ్చిన మాట ప్రకారం ఆరునెలల్లోనే 100 పడకల ఏరియా ఆసుపత్రి ఏర్పాటుకు పవన్ తీసుకున్న చర్యల పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

పింఛను కోసం దరఖాస్తు చేసుకోవాలి

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం అమలుకు సంబంధించి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. పెన్షన్‌కు అర్హులైన వ్యాధిగ్రస్తులు ఈ పథకం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఇందుకోసం కె ప్రభావతి, డీఈవో 7981604598 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఏఏ వ్యాధులకు ఎంతెంత పింఛను లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. మేజర్ తలసేమియాకు రూ.10 వేలు, సికిల్ సెల్ డిసీజ్‌కు రూ.10 వేలు, సివియర్ హిమోఫిలియాకు రూ.10 వేలు, బైలేటరల్ ఎలిఫెంటియాసిస్ గ్రేడ్- 4కు రూ.10 వేలు, కుర్చీకి పరిమితమైన పక్షవాతం రోగికి రూ.15 వేలు, సివియర్ మస్క్యులర్ డిస్ట్రోపి అలాగే ప్రమాదాలలో వెన్నుపూస దెబ్బతిని కుర్చీకి పరిమితమైన వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు, క్రానిక్ కిడ్నీ డిసిజ్ (సికెడి) వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, మల్టీడిఫార్మీటి లెప్రసీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు, కిడ్నీ, లివర్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నవారికి రూ.10 వేలు వర్తించేవిధంగా ఈ పథకం అమలవుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో వాస్తవం లేదు'

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో పులిహోర ప్రసాదంలో పురుగులు వచ్చినట్టు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ స్పష్టంచేశారు. దీనిపై తాను ప్రసాదం కౌంటర్లు, పులిహోర ప్రసాదం, తయారీ సామగ్రిని తనిఖీ చేశామన్నారు. సోమవారం వేయికిపైగా ప్రసాదం ప్యాకెట్లు విక్రయించామని, ఏ ఒక్కరి నుంచి ఫిర్యాదు అందలేదని చెప్పారు. దేవస్థానం ప్రసాదాల తయారీలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించామన్నారు.

రైలు ప్రయాణికుల రక్షణ కవచం 6
ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం 6

రైలు ప్రయాణికుల.. రక్షణ కవచం





ఆంధ్రజ్యోతి/సామర్లకోట

రైలు ప్రమాదాలు.. ఈ మాట మనం అప్పుడప్పుడూ వింటుంటాం.. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాల కారణంగా ఈ ప్రమాదాలు జరుగుతుంటాయి. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు రావడం.. అవి ఢీకొనడం.. లేదా రైలు పట్టాలు తప్పడం అనేవి ప్రధాన కారణాలు. ఇలాంటి ఘటనల్లో పదుల సంఖ్యలో ఒక్కోసారి వందల సంఖ్యలో కూడా ప్రాణాలు పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదాల నివారణకు రైల్వే శాఖ 'కవచ్' అనే విధానాన్ని తీసుకువచ్చింది. మన ఉమ్మడి జిల్లా పరిధిలో తుని నుంచి నిడదవోలు వరకు 130 కిలోమీటర్ల మేర పలు రైల్వేస్టేషన్ల మీదుగా రైల్వే ట్రాక్‌లు విస్తరించి ఉన్నాయి. వందల సంఖ్యలో రైళ్లు ప్రయాణాలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన ప్రాంతంలో 'కవచ్' ఆవశ్యకత గురించి తెలుసుకుందాం..

- ప్రయాణికుల భద్రతకు పటిష్ట వ్యవస్థ 'కవచ్'
- దక్షిణ మధ్య రైల్వేలో విజయవంతంగా అమలు
- ఉమ్మడి జిల్లాలో తుని-నిడదవోలు వరకు 130 కిలోమీర్ల మేర విస్తరించిన రైల్వేలైన్లు
- నిత్యం రాకపోకలు సాగిస్తున్న 120 రైళ్లు

రైల్వేతో ఎంతో అనుబంధం

గోదావరి జిల్లాల ప్రజలకు రైల్వేతో ఎంతో అనుబంధం ఉంది. అటు విశాఖ వైపు, ఇటు విజయవాడ వైపు అనేక అవసరాల దృష్ట్యా ఎన్నో ఏళ్లుగా ప్రజలు రైళ్లలో ప్రయాణాలు సాగిస్తున్నారు. సాధారణ ప్రయాణాలు, వ్యాపార అవసరాలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు, చదువుల నిమిత్తం, ఆధ్యాత్మిక, పర్యాటక గమ్యస్థానాలు చేరుకోవడానికి.. ఇలా రకరకాల కారణాలతో చాలా మంది నిత్యం రైలు ప్రయాణాలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాల ప్రజలు సుదూర ప్రయాణాల్లో భాగంగా మన జిల్లా మీదుగా రైళ్లలో ప్రయాణిస్తుంటారు. ఇలా కొన్ని లక్షల మంది ప్రజలను కొన్ని వందల రైళ్లు మన జిల్లా మీదుగా తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. విశాఖనుంచి వచ్చే రైళ్లు కాకినాడ జిల్లా తునిలో ప్రారంభమై అన్నవరం, చేబ్రోలు, గొల్లప్రోలు, పిఠాపురం, సామర్లకోట చేరుకుంటాయి. ఇక్కడినుంచి కాకినాడ వరకు ప్రత్యేక లైను ఉంది. సామర్లకోట మీదుగా మేడపాడు, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు, అనపర్తి, ద్వారపూడి, జేగురుపాడు, వేమగిరి, కడియం, రాజమహేంద్రవరం చేరుకుంటాయి. ఇక్కడ రాజమహేంద్రవరం టౌన్‌తోపాటు గోదావరి స్టేషన్ కూడా ఉంది. ఇక్కడ రైల్వేలైను రోడ్‌కం రైలు బ్రిడ్జి మీదుగా, మరోలైను గోదావరి ఆర్ బ్రిడ్జి మీదుగా కొవ్వూరు-పశివేదల- నిడదవోలు చేరుకుంటాయి. అక్కడినుంచి భీమవరం మీదుగా ఒకటి, ఏలూరు మీదుగా మరొకటి విజయవాడకు చేరుకుంటాయి.



సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైళ్ల ఆపరేటింగ్ సిస్టమ్

కవచ్ పనిచేసే విధానం

కవచ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలంటే లోకో పైలె ట్ల ఇంజన్ ఛాంబర్‌లో ప్రత్యేకమైన కవచ్ సాఫ్ట్ వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ట్రాక్ వెంబడి ఉన్న ప్రతి రైల్వేస్టేషన్‌లోను కవచ్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్ స్టాలేషన్ చేస్తారు. ట్రాక్ పొడవునా టెలీకమ్యూనికేషన్ టవర్లను నెలకొల్పుతారు. ట్రాక్‌ల వెంబడి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను అమర్చుకుంటూ వెళ్తారు. ఈ వ్యవ స్థలు నిరంతరాయంగా పనిచేస్తాయి. ఒకే ట్రాక్‌లో నిర్ణీత సమయంలో ఎదురెదురుగా రైళ్లు వస్తుంటే చాలా దూరం నుంచే కవచ్ పసిగట్టి వెంటనే పైలెట్లకు వీడియో, ఆడియోలతో కూడిన ప్రమాద సంకేతాలను అందిస్తుంది. ఒకవేళ లోకో పైలట్ ప్రతిస్పందించకపోతే కవచ్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. వెంటనే రైళ్ల వేగాన్ని తగ్గించేస్తుంది. రైల్వేట్రాక్ వెంబడి ఉన్న ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు ఎప్పటికప్పుడు కవచ్‌కు వాటి స్థితిగతుల గురించి సమాచారాన్ని ఇస్తాయి. దీంతో రియల్ టైమ్ డేటా ఆధారంగా కవచ్ పనిచేస్తూ రైళ్లను ఢీకొనకుండా నియంత్రిస్తాయి.

ఎల్‌హెచ్‌బీ భోగీ కొంతవరకే పరిమితం

ఒకేట్రాక్‌పై రెండు రైళ్లు ఎదురెదురుగా దూసుకురావడంవల్ల 90శాతం రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రైలు పట్టాలు తప్పినా ప్రమాదం జరుగుతుంది. ప్రస్తుతం అందుబాటులో కి తీసుకువచ్చిన ఎల్ హెచ్‌బీ భోగీల కారణంగా పట్టాలు తప్పినా అవి బ్యాలెన్స్ చేసుకుంటున్నాయి. ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చే రైళ్లు ఢీకొంటున్నప్పుడు మాత్రం ఎల్‌హెచ్‌బీ బోగీలైనా ప్రయాణికులు చనిపోతున్నారు. ఈ బోగీలు కేవలం పట్టాలు తప్పితే మాత్రమే బ్యాలెన్స్ చేయడానికి పరిమితమవుతున్నాయి. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు సిగ్నలింగ్‌లో సమస్యలు ఉన్నప్పుడే వస్తుంటాయి. మాన్యువల్‌గా ఇచ్చే సిగ్నళ్లలో ఏమాత్రం పొరపాటు జరిగినా ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. దీన్నిదృష్టిలో ఉంచుకుని ఇటీవల కాలంలో తక్కువ దూరంలో మరిన్ని సిగ్నల్స్ ఏర్పాటు, ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్ వం టివి ఏర్పాటు చేస్తున్నారు. ఇవి చాలా వరకూ సత్ఫలితాలు ఇస్తున్నా ఇటీవల కాలంలో తాజాగా చెన్నైలో జరిగిన ప్రమాదం.. ఇంకా పటిష్టమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన పరిస్థితిని చాటి చెబుతోంది. ఇందులోభాగంగా కవచ్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజయవంతంగా పరీక్షించారు. ఒకే ట్రాక్‌పైకి రెండు రైళ్లు దూసుకువస్తుంటే ఈ వ్యవస్థవల్ల పైలెట్లతో సంబంధం లేకుండా రైలు వేగాన్ని తగ్గించి వాటిని నిలుపుదల చేస్తుంది. దీని సాంకేతిక విధానాలను ఆంధ్రజ్యోతికి ఒక రైల్వే ఉన్నతాధికారి వివరించారు.


సామర్లకోట రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలు

కవచ్ అంటే ఏంటి?

కవచ్‌ను యాంటీ కొలిజన్ సిస్టమ్ అని కూడా పిలుస్తారు. రైళ్ల భద్రతను పెంచేందుకు పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని రూపొందిం చారు. ఒకే ట్రాక్‌పైకి ఎదురెదురుగా వచ్చే రైళ్ల ప్రమాదాలను నివారిం చడం, వెనుక నుంచి రైళ్లు ఢీకొనడం, అతివేగం కారణంగా పట్టాలు తప్పడం ఎదురెదురుగా వచ్చే వాటిని ఢీకొనాల్సిన పరిస్థితుల్లో ప్రమాదాలను నివారించే వ్యవస్థ ఈ కవచ్. ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్(ఏబీఎస్), ఆటోమేటిక్ వార్నింగ్ సిస్టమ్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) ట్యాగ్‌లు, జీపీఎస్-జీఎస్ఎం కమ్యూనికేషన్స్ మిళితంగా కవచ్ వ్యవస్థ ఆధారపడి పనిచేస్తుంది.


సామర్లకోటలో ఆగిన రైలులో లోకోపైలట్ క్యాబిన్

మనకీ.. కవచ్ అవసరం

కవచ్ వ్యవస్థను మొదటిసారిగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ప్రయోగాత్మకంగా ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తున్నారు. కవచ్ వ్యవస్థ అమల్లో ఉన్న ట్రాక్‌ల్లో ప్రమాదాలు దాదాపుగా తగ్గాయి. ఇటీవలకాలంలో రైళ్లు సమయపాలనతో నడుస్తున్నాయి. నిర్వహణ ఖర్చులు తగ్గుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద రైల్వేడివిజన్‌గా ప్రసిద్ధి పొందిన విజయవాడ రైల్వేడివిజన్ పరిధిలో రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా ప్రతిరోజూ ప్రయాణికులకు, రవాణా అవసరాలకు 120 రైళ్ల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయి. కాకినాడ నుంచి ప్రయాణికుల రైళ్లే కాకుండా రవాణా రైళ్లు కూడా అధికంగానే రాకపోకలు సాగిస్తున్నాయి. తీవ్ర రద్దీ దృష్ట్యా ఈ మార్గంలో భవిష్యత్తులో ఉపద్రవాలను నివారించాలంటే కవచ్ వంటి వ్యవస్థ ఎంతో కీలకంగా మారింది.

మెరుగైన చేతిరాతతో ఉజ్వల భవిత

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

పిఠాపురంలో విద్యార్థుల చేతిరాత మెరుగుపరిచే నైపుణ్య కార్యక్రమం


పిఠాపురంలో నైపుణ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి మెరుగైన చేతిరాతతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భారతీరంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ సొసైటీ (బ్రోవ్స్) సంస్థ వ్యవస్థాపకుడు వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 12వేల మంది విద్యార్థుల చేతిరాతను మెరుగుపరిచే నైపుణ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల చేతిరాత మెరుగుపరిచే విధంగా శిక్షణ ఇవ్వడంతో పాటు అందుకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా ఇచ్చేందుకు బ్రోవ్స్ సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చేతిరాతను మెరుగుపరుచుకోవడం ద్వారా తమ భవిష్యత్తును విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలుగుతారని, ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డీవైఈవో వెంకటేశ్వరరావు, మునిసిపల్ కమిషనర్ కనకారావు తదితరులున్నారు.

కాకినాడ 'పీఆర్'లో జాతీయస్థాయి సదస్సు


సదస్సులో హిందీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కాకినాడ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం అధ్యక్షతన కళాశాల తెలుగు,హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.హరిరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. గౌరవ అతిథులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ పి.ప్రేమానందం, మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జీవీ రత్నాకర్ విశిష్ట అతిథులుగా.. సినీ సంగీత దర్శకులు సాలూరు వాసూరావు, గురజాడ అప్పారావు ముని మనవడు డాక్టర్ మోపిదేవి విజయగోపాల్ పాల్గొనగా డాక్టర్ నల్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో దేశభక్తి పెంపొందుతుందన్నారు. ఏఎన్‌యూ పూర్వపు రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాద మూర్తి అభ్యుదయ సాహిత్యంపై ప్రసంగించారు. అనంతరం అతిథులు డాక్టర్ పి.హరిరామ్‌ప్రసాద్ రచించిన హిందీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలుగు, హిందీ వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధక విద్యార్థులు, కళాశాల విద్యార్థులు తెలుగు, హిందీ భాషల్లో తమ పరిశోధక పత్రాలను సమర్పించారు.

28న విద్యార్థులకు చాగంటి ప్రవచనం

కాకినాడ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే పదో తరగతి పరీక్షలు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థుల నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఈనెల 28న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు ఎంఎస్ఎన్ విద్యాసంస్థల డైరెక్టర్, యునైటెడ్ ప్రైవేటు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ ప్రవచన కర్త చాగంటిని మర్యాదపూర్వకంగా కలిసి వచ్చే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించాలని కోరగా అంగీకరించారు. కాకినాడ రాజాట్యాంక్ పార్కు వద్ద గల ఫ్యాబిన్ కన్వెన్షన్ హాల్‌లో ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.చాగంటిని శాలువాతో శ్రీవిజయ్ సత్కరించారు.


చాగంటిని శాలుశాతో సత్కరించి పూల బొకే అందజేస్తున్న శ్రీ విజయ్

ఒత్తిడిని దూరం చేసేందుకే క్రీడా పోటీలు

ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక

ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ప్రారంభం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో దేహ దారుఢ్యం.. మానసికోల్లాసం లభిస్తుందని ఏపీఎస్పీ కమాండెంట్, ఐపీఎస్ అధికారిణి ఎం.దీపిక అన్నారు. కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో సోమవారం యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో బెటాలియన్ పోలీసులు బిజీగా ఉంటారని, కుటుంబాలకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తుంటారన్నారు. ఒత్తిడిని దూరం చేసేందుకు ఏటా బెటాలియన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహిస్తూ సిబ్బంది, అధికారుల్లో నూతనోత్సాహం నింపడం జరుగుతుందన్నారు. ప్రతీ రోజూ వ్యాయామం చేస్తున్నా క్రీడలు ఆడటం వల్ల ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటా మన్నారు. పోలీసుశాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమన్నారు. ముందుగా బెటాలియన్‌లో ఉన్న 7కంపెనీల స్పోర్ట్స్ సిబ్బంది మార్చ్ ఫాస్ట్ నిర్వహించగా సిబ్బంది నుంచి కమాండెంట్ గౌరవ వందనం స్వీకరించి, గాల్లోకి బెలూన్స్ విడిచిపెట్టి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్ పోటీల్లో సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారిణి ఆర్.సుస్మిత, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు డి.మురళీకుమార్, ఎం.మోహన్‌రావు, బిఎస్.చంద్రశేఖరరావు, ఎస్.మన్మథరావు, యూని ట్ మెడికల్ ఆఫీసర్లు సునీల్, లక్ష్మి, ఆర్ఐలు కె.రవిశంకర్, బి.విఠలేశ్వరరావు, ప్రసాద్, యూనిట్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రన్నింగ్ పోటీలను తిలకిస్తున్న కమాండెంట్ దీపిక


లాంగ్ జంప్ పోటీలు


వాలీబాల్ పోటీలు

బలమైన పునాదులతో అద్భుత ఫలితాలు

ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ రాంబాబు

దివాన్‌చెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు భాష, గణితంలో పునాది బలంగా ఉంటేనే అద్భుతమైన ఫలితాలు సాధించగలరని ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కేంద్రం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్రశిక్షా ఏఎంవో పి.రాంబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ 5వ దశ ఆరు రోజుల శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలన్నారు. 2030 నాటికి సాధించాల్సిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను అందించాల్సిన విషయాన్ని నూతన జాతీయ విధానం స్పష్టం చేసిందన్నారు. ప్రథమ్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ జగదీష్, డైట్ పరిశీలకులు సుజాతారత్నం మాట్లాడుతూ విద్యార్థి దశలో మొదటి ఎనిమిదేళ్ల ప్రారంభ సంవత్సరాలని, ఇది అత్యంత కీలకమైన దశగా పేర్కొన్నారు. ఈ దశలోనే మానసికాభివృద్ధి, అభ్యసన వేగంగా ఉంటాయన్నారు. సమావేశంలో డైట్ లెక్చరర్ గంగాధరరావు, ఎంఈవోలు కె.తిరుమలరావు, సీహెచ్ ఆంజనేయులు మాట్లాడారు. ఈ ఐదో బ్యాచ్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 270 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందనున్నట్లు కోఆర్డినేటర్ రాంబాబు తెలిపారు. సమావేశంలో ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్లు అనూష, జీవన్, కేఆర్‌పీలు కె.గంగాధరరావు, ఎం.రాంబాబు, వెన్యూ ఆర్గనైజర్ పవన్, 18మంది డీఆర్పీలు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఎయిమ్స్ పరీక్షలో అన్వితకు మొదటి ర్యాంకు

కాకినాడ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంటిపిల్లల వైద్యశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యు యేషన్ పూర్తి చేసుకుని పీడీయాట్రిక్ న్యూరాలజీ స్పెషాలిటీ కోర్సు చేసేందుకు ఎయిమ్స్ నిర్వహించిన జాతీయ స్థాయి పరీక్షలో కాకినాడ భానుగుడి ప్రాంతానికి చెందిన డాక్టర్ అన్విత రాళ్లపల్లి మొదటి ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్విత సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కోర్సులో చేరేందుకు ఎంట్రన్స్ కోటాలో 2 సీట్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. ప్రణాళికబద్ధంగా చదవడంతో పాటు ఉపాధ్యాయులు మంచి కోచింగ్ అందించారన్నారు. అదేవిధంగా తన తల్లి దండ్రులు డాక్టర్ చక్రపాణి, డాక్టర్ సరస్వతిలు అందించిన ప్రోత్సాహం వల్ల జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించగలిగానన్నారు. వైద్య విద్య పూర్తయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోనే వైద్య సేవలు అందిస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు ప్రముఖులు, వైద్యులు అన్వితను అభినందించారు.


మీడియాతో మాట్లాడుతున్న అన్విత

కోట సత్తెమ్మకు చీర,సారె సమర్పణ


కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అధికారులు


చీర సారె తీసుకువస్తున్న మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు నాంగల్యదేవి దేవస్థానాల ప్రతినిధులు

నిడదవోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా రెండోరోజు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, నిడదవోలులోని నాంగల్యదేవి దేవ స్థానం అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటసత్తెమ్మకు చీర,సారె సమర్పించారు. వారికి దేవస్థానం తరఫున మేళతాళాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించి చీరసారె సమర్పించారు. భక్తులు పాల్గొన్నారు.

'శ్రీప్రకాష్'లో ఉత్సాహంగా జోష్


అతిథులతో శ్రీప్రకాష్ మేనేజింగ్ డైరెక్టర్ విజయప్రకాష్

దివాన్‌చెరువు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాజం పట్ల, పర్యావరణం, జీవితం, అత్యున్నతమైన వాటి పట్ల అవగాహన కల్పించాలని ప్రఖ్యాత కవి, రచయిత, ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ల రాఘవేంద్ర అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ 12వ వార్షికోత్సవం (జోష్) సోమవారం సాయంత్రం ఉత్సాహంగా సాగింది. శ్రీప్రకాష్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆకెళ్ల ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏదైనా కార్యక్రమాలు జరిగినపుడు పుస్తకాలను బహుమతులుగా ఇద్దామని, పిల్లలతో పుస్తకాలను చదివించాలని కోరారు. మరో ముఖ్యఅతిథి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ విద్యఎంతో బలమైన ఆయుధమని అన్నారు. మరో ముఖ్యఅతిథి జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్ మోజులో పడవద్దు అని, తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని హితవు పలికారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ విజయప్రకాష్ తమ పాఠశాల నివేదికను సమర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ వైజ్ఞానిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, మేనేజర్ ఏవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఫ్రాన్స్ దేశస్థులు

వాడపల్లి వెంకన్న ఆలయంలో..

ఫ్రాన్స్ దేశస్థులు

- స్వామి సన్నిధిలో రెండేళ్ల బాలుడి తలనీలాల సమర్పణ
- తిరునామాలు సమర్పించి స్వామివారి దర్శనం

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని సోమవారం ఫ్రాన్స్ దేశానికి చెందిన భక్తులు దర్శించుకున్నారు. వీరి పూర్వీకులు ఈ ప్రాంతానికి చెందినవారే కావడంతో స్వామి విశిష్ట తను ఫ్రాన్స్‌కు చెందిన మహిళలు తెలుసుకున్నారు. వీరిలో ఓ మహిళకు రెండేళ్ల బాలుడు ఉన్నాడు. అతడికి తొలి పుట్టివెంట్రుకలను ఆలయంలో స్వామివారి సన్నిదిలో సమర్పించారు. ఆ బాలుడు గుండుకు గంధం కూడా పూయించారు. వారంతా తిరునామాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయం మొత్తం తిరిగి ఫ్రాన్స్ దేశస్థులు సందడి చేశారు. భక్తులు వారిని ఆసక్తిగా తిలకించారు. విదేశాలనుంచి వచ్చి ఇక్కడి సంప్రదాయాలను గౌరవించడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

52 కిలోల గంజాయి పట్టివేత

- రెండు వేర్వేరు కేసుల్లో పట్టుకున్న చింతూరు పోలీసులు



పట్టుబడిన గంజాయి నిందితులతో చింతూరు పోలీసులు



గంజాయి తరలింపు కోసం వ్యాన్‌లో ఏర్పాటు చేసిన అర

చింతూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో సోమవారం చింతూరు పోలీసులు 52 కిలోల గంజాయి పట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఎస్‌ఐ పి.రమేష్ తెలిపిన వివరాలు ఇలా.. తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులు సీలేరులో 50 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. గంజాయి ఎవరి కంటా కనపడకుండా ఉండేందుకని ఒక వ్యాన్‌లో ప్రత్యేక అర ఏర్పాటు చేసి అందులో గంజాయి ప్యాకెట్లను అమర్చారు. అనంతరం చింతూరు మీదుగా తమిళనాడుకు వెళ్లే యత్నం చేశారు. కాగా పోలీసులకు అందిన సమాచారం మేరకు చేపట్టిన వాహన తనిఖీల్లో గంజాయి రవాణా బయటపడిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు గంజాయితోపాటు వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఒక వ్యక్తి రెండు కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. రెండు కిలోలు తరలిస్తూ పట్టుబడిన వ్యక్తి గంజాయి మత్తు కు అలవాటు పడ్డట్టు విచారణలో స్పష్టమైందని ఎస్‌ఐ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మంచు.. ముంచుతోంది!

- రోడ్డు కనిపించక ప్రమాదాలు
- తూర్పుగోదావరి జిల్లా అనంతపల్లి వద్ద రెండు రోజుల్లో రెండో ప్రమాదం
- వ్యాన్‌ని వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు
- నుజ్జునుజ్జయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు



నుజ్జు నుజ్జు అయిన ప్రైవేటు ట్రావెల్ బస్సు

నల్లజర్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో రాత్రిసమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి హైవేపై ప్రమాదకరంగా మారింది. శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్ ప్రమాదానికి గురికాగా.. సోమవారం తెల్లవారుజామున మరో ప్రైవేటు ట్రావెల్ బస్ ప్రమాదానికి గురైంది. రెండు ప్రమాదాల్లోనూ ప్రయాణికులు క్షేమంగా బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం 40మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు అనంతపల్లి చేరుకున్న సమయంలో మంచు ప్రభావం ఎక్కు వైంది. దీంతో ముందు ఉన్నవి కనిపించకపో వడంతో రన్నింగ్‌లో ఉన్న ఐసర్ వ్యాన్‌ని ఢీకొ ట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జ య్యింది.ప్రయాణికులకు ఏటువంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు మరొక బస్సులో వారిని గమ్యస్థానాలకు పంపించి వేశారు.సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

పోలీసులకు సైతం అంతుచిక్కని హత్యలు

- వేట్లపాలెం ఘటనపై జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సీరియస్
- ముగిసిన పోస్టుమార్టం ప్రక్రియ

సామర్లకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెంలో దళిత సామాజికవర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య దాడుల సంఘటనపై జిల్లా పోలీసు పోలీసు ఉన్నతాధికారి సామర్లకోట పోలీసు అధికారిపై తీవ్రఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటన సామర్లకోట పోలీస్‌స్టేషన్‌కు కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉండడమేగాక ఈ రెండు కుటుంబాల మధ్య మూడునెలలుగా జరుగుతున్న వివాదం తొలుత వేట్లపాలెం సచివాలయ మహిళా పోలీసు నుంచి పంచాయతీ అధికారులకు, సామర్లకోట పోలీసు అధికారులకు తెలిసిందే. అయినా ఆదివారం రాత్రి జరిగిన కత్తులతో దాడులు ఘటనను పోలీసులు ముందుగా పసిగట్టలేకపోవడంతో వారి వైఫల్యంగానే పలువురు పేర్కొంటున్నారు.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఇంటి స్థలం విషయమై ఒకే సామాజికవర్గానికి చెందిన రెండు కుటుంబాల మధ్య ఆదివారం జరిగిన కత్తులతో దాడికి దిగిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం విధితమే. పంచాయతీ అధికారులు సదరు అక్రమ నిర్మాణదారుడికి నోటీసులు సైతం ఇచ్చిన విషయం పోలీసులకు ముందే తెలిసినా పోలీసులకు, ఇంటిలిజెన్స్ వర్గాలకు ఏమాత్రం తెలియని రీతిలో పక్కా వ్యూహాన్ని పన్ని తమ దాడులతో ప్రత్యర్థి వర్గంలో ముగ్గురి హత్యకు కారణమయ్యారు. ఈ సంఘటనలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇంటి శ్లాబ్ నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉన్న కార్ధాల కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఏమాత్రం ఊహించలేకపోవడం వల్లే కత్తిపోట్లకు గురైనట్లు తెలిసింది. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకునే లోపునే కార్ధాల కుటుంబాలకు చెందిన ఒకరు మృతి మరో 9మంది వ్యక్తులు రక్తపుమడుగులో ఉన్నారు. సంఘటనా స్థలిలో హాహాకారాలు మిన్నంటడంతో దాడులకు పాల్పడిన వారు తిరిగి కత్తులతో పరారయ్యారు. సంఘటనకు దారి తీసిన వాస్తవ సమాచారాన్ని ఆదివారం రాత్రి కొంతమేర సేకరించిన జిల్లా పోలీసు ఉన్నతాధికారి సోమవారం మరింత సమాచారాన్ని సేకరించినట్లు పోలీసువర్గాల ద్వారా తెలిసింది. దీంతో ముమ్మాటికీ పోలీసుల వైఫల్యం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది.

మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి

కాగా ఆదివారం హత్యకు గురైన ముగ్గురి మృతదేహాలకు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తిచేసి సోమవారం రాత్రి వేట్లపాలెంలోని కుటుంబసభ్యులకు అప్పగించడంతో మూడు మృతదేహాలకు వేట్లపాలెం శివారు ఆర్బీ కొత్తూరు వెళ్లే రోడ్డులో దళిత శ్మశానవాటికకు కాకినాడ నుంచి నేరుగా తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సామర్లకోట పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు నిర్వహించారు. హత్యా సంఘటన జరిగి 24 గంటలు దాటుతున్నా పోలీసుల చర్యలు అత్యంత గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు దారితీస్తోంది.



హత్యల ఘటనలో దాడికి ఉపయోగించిన కత్తి

వెంకన్న ఆలయంపై ఆరోపణలు అర్థరహితం

- సోషల్ మీడియా పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు: ఈవో

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంపై ఓ వ్యక్తి సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలపై ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తీవ్రంగా ఖండిస్తూ ఆ ఆరోపణలు అర్థరహితమన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈనెల 12న దేవదాయశాఖ పర్యవేక్షణాధికారుల సమక్షంలో 300మంది సిబ్బంది సేవకులు, అర్చకులు, గ్రామస్థులు, బ్యాంకు సిబ్బంది సమక్షంలో హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించామన్నారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు నిఘా నీడలో లెక్కింపు ప్రక్రియ ప్రతి నెలా చేపడతామన్నారు. ఈ లెక్కింపులో రూ.5లక్షల నగదు గోల్‌మాల్ చేశారని ఓ పార్టీకి చెందిన వ్యక్తి సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టడంతో కలకలం చెలరేగింది. స్వామివారి ఆలయంపై తప్పుడు ప్రచారం నిర్వహిస్తూ స్వామి ప్రతిష్ఠతను అపఖ్యాతిపాలు చేస్తూ తప్పుడు ఆరోపణలు చేసిన సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన పెద్దలు హుండీ లెక్కింపు సీసీ ఫుటేజీని పరిశీలించారు. తప్పుడు ఆరోపణలు చేసిన వ్యక్తిపై కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు ఈవో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో నుంచి జారిపడి డ్వాక్రా వీవోఏ మృతి



నారాయణమ్మ (ఫైల్)

తుని రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో డ్వాక్రా వీవోఏ మృతి చెందింది. కాకినాడ జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన నల్లల ఆదినారాయణమ్మ(23) డ్వాక్రా వీవోఏగా విధులు నిర్వర్తిస్తోంది. తుని కార్యాలయంలో పనులు ముగించుకుని ఆదివారం రాత్రి ఆటోలో ఇంటికి తిరిగి వెళ్తుండగా జారిపడి తీవ్ర గాయాలపాలైంది. ఆమెను 108 అంబులెన్సులో తొలుత తుని ఏరియా ఆస్పత్రికి, అక్కడినుంచి మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి భర్తతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

కాకినాడ క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం ఓ వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్ఆర్ జిల్లా రాజవొమ్మంగికి చెందిన 36ఏళ్ల ఎలుసూరి కనకరాజ్‌కుమార్ కాకినాడ మెయిన్‌రోడ్డులోని బజాజ్ ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్ గా పని చేస్తున్నాడు. కాగా జగన్నాథపురానికి చెందిన 25ఏళ్ల లంకె శ్రీనివాస్ చాలా కాలంగా కనకరాజ్‌కుమార్‌కి స్నేహితుడు. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉండడం తో కొంతకాలంగా మనస్పర్థలు ఏర్పడ్డా యి. ఈక్రమంలో ఆదివారం రాత్రి వారి మధ్య ఏర్పడ్డ ఘర్షణ కారణంగా సోమవారం సంస్థలో విధుల్లో ఉన్న కనకరాజ్‌కుమార్‌ను తన కూడా తెచ్చుకున్న కత్తితో శ్రీనివాస్ ఒక్క వేటువేశాడు. తప్పించుకునే క్రమంలో కనకరాజ్‌కుమార్ తలకుబలమైన గాయమైంది. శ్రీనివాస్ అక్కడినుంచి పరారయ్యాడు. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఆగిందని పట్టాలు దాటబోయి..
మరో రైలు ఢీకొని యువకుడి మృతి



అనపర్తి రైల్వేస్టేషన్‌లో రైలు ఢీకొని మృతి చెందిన పవన్

అనపర్తి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మూసి ఉన్న రైల్వే గేటు వద్ద పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా మరో రైలు ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి బాబానగర్‌కు చెందిన కులంపర్తి పవన్(25) ఒక హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం హోటల్ పనికి వెళుతూ బాలుర ఉన్నత పాఠశాల వద్ద మూసి ఉన్న రైల్వే గేటు వద్ద పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తున్నాడు. అప్పటికే గూడ్సు ట్రైన్ ఆగి ఉండడంతో ఆ ట్రైన్ ముందుకు వెళుతుందేమోనన్న మీమాంసతో గూడ్సు బండిని దాటుతుండగా మరో ట్రాక్ పైనుంచి విశాఖ వైపుగా వెళుతున్న మరో గూడ్సు రైలు పవన్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించినట్టు రైల్వే సిబ్బంది తెలిపారు.

ఉపాధి..ఊపిరి తీసింది!

- ట్రాక్టరు తిరగబడి యువకుడి మృతి
- తూర్పుగోదావరి జిల్లా పెద్దేవంలో ఘటన



ట్రాక్టరు తిరగబడి చనిపోయిన దుంపల రాజు

తాళ్లపూడి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి ఊపిరి తీసింది. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన దుంపల రాజు (33) పెద్దేవం శివారులో ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. అతడికి భార్య, నెలల వయసు గల బాబు ఉన్నారు. ఇటుకలు తయారు చేయడానికి సోమవారం ఉదయం అడుసు మట్టిని ట్రాక్టరుతో తొక్కిస్తుండగా అకస్మాత్తుగా ట్రాక్టరు తిరగబడి అతను మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు తరలించామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

గోదావరి నదిలో మొసలి సంచారం

- లొల్లలో చూసిన స్థానికుడు
- భయాందోళనలో రైతులు

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలోని గోదావరి నదీలో మొసలి సంచరిస్తుందని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గౌతమి గోదావరి నదీలో సోమవారం లొల్ల గ్రామానికి చెందిన దాట్ల సత్తిరాజు రైతు పశువులను గోదావరి వద్దకు తీసుకువెళ్లాడు. ఒడ్డుకు చేరుకున్న 9 అడుగుల మొసలని చూసి ఆ రైతు ఆందోళనకు గురయ్యాడు. ఆ రైతు శబ్దం విని ఒడ్డును ఉన్న మొసలి నదీలోకి జారుకుంది. మొసలిని చూసిన రైతు విషయాన్ని పక్కనే ఉన్న రైతులకు వివరించాడు. నిత్యం పాడి రైతులు గోదావరి వద్దకు చేరుకుని పశువులను కడుగుతూ ఉంటారు. శ్మశానవాటిక ఇక్కడే ఉండడంతో మృతదేహాలను ఖననం చేసేందుకు వస్తూ ఉంటారు. దీనిపై రైతులు, ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. గోదావరిలో స్నానం ఆచరించేవారు జాగ్రత్తగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు.

'రేబిస్'తో వ్యక్తి మృతి

ఆత్రేయపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం కుమ్మరవీధికి చెందిన మానేపల్లి దుర్గాప్రసాద్(37) రేబిస్ వ్యాధితో మృతిచెందాడు. ఆయన ఆర్టీసీలో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు నెలల క్రితం ఇంటివద్ద ఉన్న ప్రసాద్‌ను కుక్క కరిచింది. ఈ మేరకు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కడినుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రాజోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిమండలం అంతర్వేదికర రావి వారి గ్రూపునకు చెందిన తన చిన్నాన్న రావి వీరవెంకటనరసింహారావును ఆస్తికోసం కొట్టి చంపిన కేసులో రావి రాంబాబును మలికిపురం మండలం దిండి చెక్‌పోస్టు వద్ద రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ సోమవారం అరెస్టు చేశారు. ఈసందర్భంగా రాజోలు సర్కిల్ కార్యాలయంలో సీఐ నరేష్‌కుమార్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితుడు రాంబాబు చిన్నాన్న వీరవెంకటనరసింహారావును కొట్టి చంపాడన్నారు. ఈ కేసును ఛేదించిన రాజోలు సీఐ రాజేష్‌కుమార్, సఖినేటిపల్లి ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, సిబ్బందిని ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ అభినందించారు.

రావులపాలెంలో వివాహిత ఆత్మహత్య



మామిడిశెట్టి శృతి(ఫైల్)

రావులపాలెం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిశెట్టి శృతి(25)కి ఐదేళ్ల క్రితం వెంకన్నబాబుతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. 15వ తేదీ మృతురాలు భర్త పని నిమిత్తం సిద్ధాంతం వెళ్లి అదే రోజు సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి చూడగా శృతి బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉండడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని మృతురాలు తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. తండ్రి కొప్పిశెట్టి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.చంటి తెలిపారు. శృతి ఎందుకు ఆత్మహత్య చేసుకుందనే కారణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం మహిళ..
హైదరాబాద్‌లో అనుమానాస్పద మృతి



మృతురాలు అన్సర్ జహాన్ (ఫైల్ ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): బీటెక్ చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్న రాజమహేంద్రవరానికి చెందిన ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన ఈనెల 12న తెలంగాణ రాష్ట్రం నాంపల్లిలో జరిగింది. మృతురాలు తండ్రి ఫయాజ్ కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోరక్షణపేటకు చెందిన టీడీపీ నాయకురాలు సయ్యద్ అన్సరీ, ఫయాజ్ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అన్సర్ జహాన్(30) బీటెక్ చదువుకుంది. ఆమెకు వివాహమై ఏడేళ్ల పాప ఉంది. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకున్నారు. అటుపై జహాన్ హైదరాబాద్‌లో చైతన్య విద్యాసంస్థలో రెండేళ్లుగా పనిచేస్తోంది. ఈ క్రమంలో అక్కడే పనిచేసే నాంపల్లికి చెందిన ఆలీ హుస్సేన్ అనే వ్యక్తి ఒక ప్రాజెక్టు వర్కు ఉందని చెప్పాడు. దానికి తాను రూ.5లక్షలు పెడతానని, నువ్వు రూ.5లక్షలు పెట్టాలని, దాన్ని పూర్తి చేస్తే రూ.1.50 కోట్లు వస్తాయని చెప్పాడు. దీంతో ఆమె రూ.5లక్షలు పెట్టుబడి పెట్టింది. ఆలీ హుస్సేన్ నాంపల్లిలో ఆఫీసును ప్రారంభించాడు. ఈ నెలలో పని పూర్తయ్యింది. దీంతో తనకు రావాల్సిన రూ.50 లక్షలు ఇవ్వాలని జహాన్ ఒత్తిడి చేసింది. ఈ నేపథ్యంలో ఈనెల 12వతేదీ సాయంత్రం నాంపల్లిలో ఆఫీస్‌లో జహాన్‌పై హుస్సేన్ రాడ్‌తో కొట్టి చంపేశాడని, ఆపై చున్నీతో ఉరివేసుకున్నట్టు సృష్టించాడని మృతురాలి తండ్రి ఫయాజ్ ఆరోపించాడు. తాను శుక్రవారం తన కుమార్తెకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని, దీంతో అనుమానం వచ్చి ఆమె ఆఫీస్‌కు ఫోన్ చేసినా స్పందన లేకపోయిందని తెలిపారు. ఆలీ హుస్సేస్ విజిటింగ్ కార్డు గతంలో తన కుమార్తె ఇవ్వడంతో అతడికి ఫోన్ చేస్తే అతని తల్లి లిఫ్ట్ చేసి జహాన్ ఉరివేసుకుందని చెప్పారని, దీంతో తాను తన భార్య కలిసి హైదరాబాద్ వెళ్తే జరిగిన విషయం తెలిసిందని చెప్పారు. హత్య చేసిన ఆలీ హుస్సేన్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. సోమవారం అన్సర్ జహాన్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ నివాళులర్పించారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని రూ.57.75 లక్షల టోకరా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాజెక్టులు ఇప్పిస్తానని ముగ్గురు తన వద్ద నుంచి రూ.57లక్షల75వేలు తీసుకుని మోసం చేశారని బొమ్మూరు వెంకటగార్డెన్స్‌కు చెందిన చింతకాయల సోమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన సోమేష్ ఎల్అండ్‌టీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతను ప్రస్తుతం బొమ్మూరులో నివాసం ఉంటున్నాడు. అతనికి పరిచయమైన ఆకుల సౌజన్య, ఆకుల శ్రీనివాస్, అజ్జరపు సునీల్ ప్రభుత్వం పాజెక్టులు ఇప్పిస్తామని నమ్మించి దఫదఫాలుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయించుకుని ప్రాజెక్టులు మంజూరైనట్టు లెటర్లు సోమేష్‌కు ఇచ్చారని సోమేష్ ఆరోపిస్తున్నాడు. ఆ లెటర్లు ఫేక్ అని తెలియడంతో తాను డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే వారి నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో తనకు న్యాయం చేయాలని బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

రేపు మరిడమ్మ ఆలయంలో హుండీల ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణంలోని మరిడమ్మ ఆలయంలో హుండీల ఆదాయాన్ని ఈనెల 18వ తేదీ బుధవారం దేవదాయశాఖ అధికారులు సమక్షంలో లెక్కించనున్నట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కరుం విజయలక్ష్మీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోయిన కారు

తప్పిన ప్రమాదం

బయటపడిన ఇద్దరు ప్రయాణికులు



శీలంవారిపాలెం వంతెన పైనుంచి పడిన కారు

కొత్తపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పిన మారుతి షిఫ్ట్ కారు కాలువలోకి దూసుకొని పోయిన సంఘటన శీలంవారిపాలెం ఉప్పుటేరు వద్ద జరిగింది. తొండంగి మండలం ఏవీ నగరం నుంచి మారుతీ షిఫ్ట్ కారులో ఇద్దరు వ్యక్తులు కోనపాపపేట మీదుగా ఉప్పాడ బయలుదేరారు. కారు కోనపాపపేట దాటి శీలంవారిపాలెం ఉప్పుటేరు వద్దకు రాగానే అదుపు తప్పి ఉప్పుటేరులోకి దూసుకుపోయింది. వంతెన పై నుంచి ఉప్పుటేరు సుమారు 4మీటర్ల ఎత్తులో నుంచి కిందపడింది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు క్షేమంగా బయటపడ్డారని స్థానికులు తెలిపారు. కారు ఉప్పుటేరులో పడిన టైమ్‌లో నీరు అంతగా లేకపోవడంతో ఇద్దరు ప్రాణాలతో బతికి బయటపడ్డారని స్థానికులు చెబుతున్నారు. కొత్తపల్లి ఎస్‌ఐ జివెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారును క్రేన్‌సాయంతో పైకి తీశారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు దోహదం : ఎంపీ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ఎంతగానో దోహదపడతాయని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కాకినాడ ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోల్పోతున్నారన్నారు. హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థకు గతంలో అనేక విశ్వ విద్యాలయాలు అనుమతులు మంజూరు చేస్తారన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ బోధన ద్వారా విద్యార్థులకు శారీరక, మానసిక దృఢత్వంతో పాటు యోగా, మెడిటేషన్, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర యూత్, స్పోర్ట్స్ మంత్రిత్వ శాఖ అనుమతితో సెంట్రల్ టీం ద్వారా నియమితమైన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ కోర్డి నేటర్ మహమ్మద్ హబీబ్ బాషా ఎంపీని కలిశారు.

మీ సేవ సెంటర్ సీజ్



సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్‌బ్రాంచి ఎదురుగా గల మీసేవ కేంద్రాన్ని మున్సిపల్ సిబ్బంది సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. మీసేవ కేంద్రం ఆపరేటర్‌పై పట్టణానికి చెందిన బోడపాటి దుర్గ, వాసంశెట్టి పోసయ్య చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ కమిషనర్ కనకారావు విచారణ నిర్వహించి కలెక్టరుకు నివేదిక అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మీసేవా కేంద్రాన్ని సీజ్ చేశామని కమిషనర్ తెలిపారు. మీసేవ కేంద్రాల నిర్వహణలో నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'నోటీసు బోర్డులు తొలగించేవారిపై చర్యలు తీసుకోవాలి'

తాళ్లరేవు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు సర్వేనెం.363/1లో 90సెంట్లు నాన్ లేఅవుట్ భూమిలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన నోటీసు బోర్డులను తొలగించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ మైదు హరిబాబు సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఈ స్థలంలో 2సార్లు నోటీసు బోర్డులను ఏర్పాటు చేస్తే తొలగించేశారన్నారు. నాన్‌లేఅవుట్ స్థలానికి ప్రభుత్వ అనుమతులున్నట్టు ప్రచారం చేస్తున్న వుంగరాల కొండలరావు, సత్యప్రసాద్‌పై చర్యలుతీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

స్టడీ మెటీరియల్ అందజేత

సామర్లకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి మొగలి వెంకటేష్ సౌజన్యంతో యూటీఎఫ్ ఉపాధ్యాయసంఘం ముద్రించిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను సోమవారం విద్యార్థులకు అందజేశారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బొజ్జా అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కరకుమార్ తదితర ఉపాధ్యాయులు సూర్యనారాయణ, సంజీవరావు పాల్గొని పాఠశాల పూర్వవిద్యార్థి వెంకటేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీరు అందక ఇబ్బందులు

త్వరగా విడుదల చేయాలని కోరుతున్న రైతులు



కొత్తపల్లి: కొండెవరంలో నీరందక సగం దమ్ములో ఆరిపోతున్న చేలు

కొత్తపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గోదావరి పిఠాపురం బ్రాంచి(పీబీసీ) కెనాల్‌తో పాటు ఏలేరు నీటిని త్వరగా విడుదల చేసి ఆదుకోవాలని కొత్తపల్లి మండల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో కాలువల ద్వారా సాగు నీరు సక్రమంగా విడుదల కాకపోవడంతో నారుమళ్ళు, అక్కడక్కడ దమ్ముచేసిన చేలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి సాగునీరు సరఫరా జరిగే పీబీసీకి దివిలి వద్ద ముక్కొల్లు వద్ద బల్లలు అడ్డంగా వేయడం వల్ల నీరు కిందకు రావడం లేదని, వాటిని తొలగించాలని కొత్తపల్లి నీటి వినియోగదారుల సంఘ డైరెక్టర్ చోడిశెట్టి కృష్ణ తెలిపారు. ఏలేరు నుంచి నీరు విడుదల చేసినప్పటికీ ముక్కొల్లు వద్ద వేసిన బల్లలు తొలగిస్తే కానీ నీరు సక్రమంగా కిందికి ప్రవహించదన్నారు. ప్రస్తుతం పీబీసీ ద్వారా సుమారు 60క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా జరుగుతుందని, పీబీసీ, ఏలేరు కాలువల ద్వారా సుమారు 10రోజులపాటు నిరంతరం సాగునీరు విడుదల చేస్తే జనవరి 10 నాటికి దాళ్వా వరినాట్లు పూర్తవుతాయని నీటి సంఘ డైరెక్టర్ కృష్ణ చెప్పారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరగా సాగునీటిని విడుదల చేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

పంటకాలువలో తూటు

తాళ్లరేవు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ పరిధి బొడ్డువానిలంక నుంచి నక్కతిప్ప పంటకాలువలో తూటు పేరుకుపోయి సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. కాలువ మెరక వేయడంతో సాగునీరు పారక రైతులు దమ్ములు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా ఏర్పడిన సాగునీటి సంఘాల అధ్యక్షులు దృష్టి సారించి పంటకాలువలో తూటును తొలగిస్తే రైతులకు సాగునీరు సరఫరా అవుతుందని ఇప్పటికైనా స్పందించాలని రైతులు కోరుతున్నారు.



తాళ్లరేవు: పంటకాలువలో పేరుకుపోయిన తూటు

ఆలయాల్లో ధనుర్మాస పూజలు

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఈవో నున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవాసమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే కుంతీ మాధవస్వామి వార్షిక ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైఖానసాగమోక్త ప్రకారం స్వామి, గోదాఅమ్మవారికి, ఆళ్వార్లకు సేవలు, విశేష ఉత్సవాలు నెలరోజులు పాటు నిర్వహిస్తారు. తొలిరోజు అభిషేకం, ధనుర్మాసం ప్రారంభం, స్వామి, గోదాఅమ్మవార్లకు పంచామృతాభిషేకం, శ్రీచూర్ణం అర్చనలు, ద్రవిడ ప్రబంధ పారాయణ నివేదనలు, రాత్రి గోదాఅమ్మవారి మాడవీధిసేవ జరుజరిగాయి. ఆలయ ఈవో నున్న శ్రీరాములు,



పిఠాపురంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకారం

కుంతీమాధవస్వామి భక్తబృందం సభ్యులున్నారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మార్గశిర ఆరుద్ర నక్షత్ర అభిషేకాలు నిర్వహించారు. ధనుర్మాసం తొలి రోజు కావడంతో తీర్థపుబిందెతో ప్రారంభించి పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాసపూర్వకంగా నమక, చమకాలతో 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకం జరిపించారు. మార్గశిరమాసంలో ఆరుద్ర నక్షత్రం, సోమవారం కలిసి రావడంతో స్వామి వారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. లలితాదేవికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు, ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, సేవాకమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామర్లకోట: సామర్లకోటలో పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల కుటుంబీకులచే వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి విశేష అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు.. మహాలక్ష్మీ అమ్మవారికి విశేష సింధూరార్చన పూజలు నిర్వహించారు. వేట్లపాలెం గోదావరి ఒడ్డున ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘమాస పూజలు ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. వేంకటేశ్వరస్వామికి లక్షతులసి అర్చన పూజలు నిర్వహించారు.

తాళ్లరేవు: భూసమేత కేశవస్వామివారి దేవస్థానంలో ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు శ్రావణకుమార్ స్వామివారిని అలంకరించి పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అభిషేకాలు నిర్వహించారు.



గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామికి నిర్వహించిన అభిషేకం

పాదగయలో అభిషేకాలు

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు, శివుడికి ప్రీతికరమైన సోమవారం, జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు రావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు రాక ప్రారంభమైంది. కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లకు అర్చనలు జరిగాయి. దర్శనానికి భక్తులు బారులు తీరారు. రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ఈవో శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పాదగయలో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

అన్న క్యాంటీన్ పనుల బిల్లులు ఇవ్వరా?

కలెక్టర్, కమిషనర్‌తో

కాంట్రాక్టర్ దురుసు ప్రవర్తన



కలెక్టర్‌ను బిల్లుల కోసం ప్రశ్నిస్తున్న కాంట్రాక్టర్ సూరవరపు దివాణం

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్ భవనాల పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో ఆసహనానికి గురైన కాంట్రాక్టర్ సూరవరపు సత్తిరాజు(దివాణం) పిఠాపురంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో హల్‌చల్ సృష్టించారు. తాను జిల్లాలో 4 అన్న క్యాంటీన్ భవనాల మరమ్మతులు, ఆధునీకరణ పనులు చేశానని, 3 నెలలు గడిచినా ఇప్పటి వరకూ బిల్లులు ఇవ్వలేదని కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లేందుకు వచ్చారు. అయితే ఇతను గతంలో పలుమార్లు తనకు బిల్లులు చెల్లించడం లేదంటూ పిఠాపురం మున్సిపల్ అధికారులపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అతనిని పక్కకు వెళ్లాలని సూచించారు. దీంతో దివాణం కలెక్టర్, మున్సిపల్ కమిషనరు కనకారావుతో దురుసుగా ప్రవర్తించారు. అదే సమయంలో దుర్భాషలు ఆడారు. దీంతో పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్ జోక్యం చేసుకుని పక్కకు తీసుకువెళ్లారు.

'అధికారులను తిట్టలేదు'

తాను ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో అధికారులను దూషించినట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని కాంట్రాక్టర్ సూరవరపు దివాణం స్పష్టం చేశారు. తాను అన్న క్యాంటీన్ భవనాల పనులతో పాటు పూడిక తీత పనులు నిర్వహించానని, బిల్లుల విషయంలో పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించానని తెలిపారు. ఈ సమయంలో తనను కొందరు నాయకులు వెటకారంగా మాట్లాడటంతో పాటు పక్కకు లాగడంతో వారిని తిట్టానని, కలెక్టర్, ఇతర అధికారులను ఏమి అనలేదని ఆయన తెలిపారు.

అభివృద్ధి పేరుతో రూ.3.80కోట్లు అవినీతి

వివరాలు అడుగుతుంటే ఇవ్వరా

గొల్లప్రోలు నగర పంచాయతీ అధికారులను నిలదీసిన టీడీపీ నేతలు



గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో ఏఈ, సిబ్బందిని నిలదీస్తున్న టీడీపీ నేతలు

గొల్లప్రోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగరపంచాయతీ పరిధిలో అభివృద్ధి పేరుతో రూ.3.80కోట్లు మేర అవినీతి జరిగిందని, పనులు చేయకుండానే బిల్లులు చేశారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సదరు పనులు, బిల్లుల చెల్లింపులు తదితర వివరాలను కోరినా, 2వారాలు దాటినా స్పందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ గొల్లప్రోలు పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు నాయకత్వంలో నాయకులు సోమవారం గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఏఈ ప్రభాకర్, సిబ్బందిని ఈవిషయంపై నిలదీశారు. 14వ ఆర్థికసంఘంతో పాటు వివిధ గ్రాంట్లు, నగరపంచాయతీ సాధారణ నిధుల ద్వారా చేపట్టిన పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయని, 2023 ఏప్రిల్ 1వ తేది వరకూ కాంట్రాక్టర్లకు జరిపిన చెల్లింపులు, నామినేషన్ పద్ధతిలో ఏయే పనులు అప్పగించారు, పనులు చేయకుండా బిల్లులు ముందుగానే ఎందుకు చెల్లించాల్సి వచ్చింది, ఒకే పనిని పలు రకాలుగా విభజించి బిల్లులు చేయడం, లైటింగ్ సహా వివిధ రకాల సామాగ్రి కొనుగోలుకు అధిక ధరలు ఎందుకు చెల్లించారు తదితర వివరాలు కోరుతూ ఈనెల 2న కమిషనర్‌కు లేఖ ఇచ్చామని సుబ్బారావు వివరించారు. వారం రోజుల్లో వివరాలు ఇస్తామన్నా, ఇప్పటి వరకూ అందలేదని తెలిపారు. అధికారులు, సిబ్బందిని అడుగుతుంటే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని మండిపడ్డారు. సెక్షన్ గుమాస్తా తనకు బదిలీ అయిన ఉద్యోగి 300కు పైగా ఉన్న ఫైల్స్‌లో కేవలం 11 ఫైల్స్ మాత్రమే అప్పగించారని చెబుతున్నారని దీనిని బట్టే ఇందులో భారీగా అవినీతి జరిగిందనే విషయం వెల్లడవుతుందన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టరు, విజిలెన్స్‌ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

విద్యుత్‌ను ఆదా చేసుకోవాలి

తాళ్లరేవు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకుని విద్యుత్‌ని ఆదా చేసుకోవాలని కాకినాడ విద్యుత్‌శాఖ ఏడీ విష్ణుమూర్తి అన్నారు. సోమవారం తాళ్లరేవు సూర్యభాస్కర కల్యాణమండపంలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా రాయితీతో సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటుచేసుకోవాలని వినియోగదారులకు అవగాహన కల్పించారు. సోలార్ కనక్షన్ కావాల్సిన వారు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని కోరారు. ఏఈ సుబ్రహ్మణ్యం, సబ్ ఇంజనీర్ నాగరాజు, సోలార్ కాంట్రాక్టర్లు, వినియోగదారులు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లరేవులో మాట్లాడుతున్న ఏడీ విష్ణుమూర్తి

పోలీస్ గ్రీవెన్స్‌కు 58 అర్జీలు



అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ

కాకినాడ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితుల సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 58 మంది అర్జీదారులు సోమవారం పోలీస్ గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ వెంటనే స్పందించి సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఫిర్యాదుదారుల సమస్య సమ్మతమైనది అయితే వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజెవి భాస్కరరావు, ఎస్‌బి డీఎస్పీ సిహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీ అభినందన

రోలర్ స్కేటింగ్‌లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ క్రీడల్లో రజత పతకం సాధించిన కాకినాడ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్ల పిల్లలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం అభినంధించారు. మైసూర్‌లో ఈనెల 5 నుంచి 15 వరకు జరిగిన రోలర్ స్కేటింగ్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో 5 నుంచి 7 ఏళ్ల గ్రూప్‌లో సిల్వర్ మెడల్, అలాగే 9 నుంచి 11 ఏళ్ల గ్రూప్‌లో నాల్గో స్థానంలో నిలిచిన 6 ఏళ్ల కుంచే హన్సిత్, 10 ఏళ్ల విరోతి రిషీశ్వర్‌ను ఎస్పీ అభినందించారు.

పారదర్శకంగా 'ఉపాధి హామీ' అమలు

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటలక్ష్మి

సామర్లకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సమగ్రంగా అమలుచేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలుచేసేందుకు ఏటా సామాజిక తనిఖీలు, గ్రామసభలు నిర్వహిస్తున్నామని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం సామర్లకోట మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పనులు అమలు తీరుపై సామాజిక తనిఖీ, సదస్సు ఎంపీడీవో హిమమహేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ వెంకటలక్ష్మి గ్రామాల వారీ పనులు అమలు, సామాజిక తనిఖీల్లో లోపాలు గుర్తింపు రికవరీలు వంటి అంశాలను సమీక్షించారు. మండలంలోని 12 గ్రామాలకు చెంది ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి తప్పుడు మస్టర్లు నమోదులు, వేతనం అధికంగా చెల్లింపులు వంటి లోపాలతో రూ.64,902 ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేశారు. వాటిలో అత్యధిక మొత్తంగా వేట్లపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి వసూలు చేశారు. సదస్సులో ఏపీడీ పల్లాబత్తుల వసంతమాధవి, ఎస్‌ఆర్‌పీ సింహాద్రి, ఎస్టీఎం గౌరీశంకర్, సోషల్ ఆడిట్ రాజేష్ తదితర ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పెద్దాపురంలో...

పెద్దాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి హాజరయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగినపనులపై తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమణ తదితరులు ఉన్నారు.



సామర్లకోటలో జరిగిన ఉపాధి సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ప్రసంగిస్తున్న వెంకటలక్ష్మి

సమస్యల పరిష్కారానికి సత్వరం చొరవ

కాకినాడ కమిషనర్ భావన




ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి కమిషనర్ భావన హాజరయ్యారు. 8మంది డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఫోన్ చేసి సమస్యలు తెలిపారు. అనంతరం నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన వివిధ సమస్యలపై 46 ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించానికి అధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎస్‌ఈ కామేశ్వరరావు, మేనేజర్ సత్యనారాయణ, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ షెల్టర్లు మత్స్యకారులకు అప్పగించాలి

కలెక్టర్‌ను కోరిన మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో కలెక్టర్‌కు మత్స్యకారుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న వర్మ

పిఠాపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలో సముద్ర తీరప్రాంతాలైన మూలపేట, ఉప్పాడ, యండపల్లి తదితర చోట్ల నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్లు(తుఫాన్ షెల్టర్లు)ల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేయించి మత్స్యకారులకు అప్పగించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని మత్స్యకార సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన సోమవారం జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్‌ను కలిసి మత్స్యకారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రూ.10 కోట్లు వ్యయంతో నిర్మించిన వాటిని ఇతర అవసరాలకు ఉపయోగించడం తగదన్నారు. మూలపేటలోని కమ్యూనిటీహాలును ఎస్‌ఈజెడ్ యజమాన్యానికి గత వైసీపీ ప్రభుత్వం అప్పగించిందని తక్షణం వారి నుంచి వెనక్కి తీసుకోవాలని సూచించారు. మత్స్యకారులకు సంబంధించిన ఇతర సమస్యలపై వినతులు అందజేశారు. వాటిని పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

'సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి'

పెద్దాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనంతో జీవితానికి సార్ధకత చేకూరుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు అన్నారు. సోమవారం పట్టణంలో తాళ్లూరి వారి సత్రంలో హరిశంకరాచార్యవేద శాస్త్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పోటీల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీఒక్కరూ ఆధ్యాత్మిక భావజాలంతో ముందుకు సాగాలన్నారు. సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం భగవద్గీత పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. రాజాసూరిబాబురాజును ట్రస్ట్ అధ్యక్షుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హరిశంకరాచార్య వేద శాస్త్ర ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టెం హరిగోపాలశర్మ, డాక్టర్ జ్యోశ్యుల కృష్ణబాబు, పాల శంకరం, డీవీ శాస్త్రీ, ఆచారి మాస్టారు, తాడికొండ గాయత్రి, రాయప్రోలు మరిడికామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రాజాసూరిబాబురాజును సత్కరిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు హరిగోపాలశర్మ

ప్రభుత్వ సలహాదారు చాగంటిని కలిసిన ఎమ్మెల్యే



చాగంటి కోటేశ్వరరావును కలిసి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థుల నైతిక విలువల ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన ఆధ్యాత్మిక ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావును సోమవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా గల ఆశ్రమంలో చాగంటిని కలిసి జ్ఞాపిక అందజేశారు.

'శతాబ్ది పార్కును మెరుగుపరచండి'

పెద్దాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న శతాబ్ది పార్కును మరింతగా మెరుగుపరచాలని ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ ఛైర్మన్ గుణ్ణం లక్ష్మణరావు ఆర్డీవోకు పీజీఆర్‌ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. పార్కు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటుందని, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు పార్కు అస్తవ్యస్తంగా ఉండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులను అభివృద్ధి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 7 అర్జీలు అందినట్టు ఆర్డీవో శ్రీరమణి తెలిపారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

సుస్థిర అభివృద్ధి సూచికల తయారీపై నేడు, రేపు శిక్షణ తరగతులు

ప్రత్తిపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి సూచికల తయారీపై ఈ నెల 17, 18 తేదీల్లో మండలంలోని సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు చెప్పారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 51 అర్జీలు

రంపచోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏకార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 51 అర్జీలు అందాయని పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఏపీవో (జి) డీఎన్వీ రమణ, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్డీసీ జాన్‌రాజ్, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం వెంకటఇందిర, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఏఎంవో విజయభాస్కర్, ఈఈ సుబ్బయ్య, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీధర్, స్వామి, రవీంద్రబాబు, పీఏవో ఎల్.రాంబాబు, ఏడీఏలు కె.సావిత్రి, సీహెచ్‌కేవీ చౌదరి, ఏపీడీ జి.శ్రీనివాసరావు, డీఈఈలు మల్లికార్జునరావు, సాయిసతీష్, రామచంద్రమూర్తి, పి.వెంకటరమణ, శ్రీనివాసరావు, నాగరాజు, లీగల్ సెల్ న్యాయవాది సత్యనారాయణ పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

గుర్తేడు రోడ్డు నిర్మాణం కోరుతూ రిలే దీక్షలు

వై.రామవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్తేడు రహదారి నిర్మాణం అటవీ శాఖ అభ్యంతరాలతో ఏళ్ల తరబడి నిలిచిపోయింది... దానిని పూర్తిచేసే వరకు తాము చేపట్టే రిలే దీక్షలు ఆగవని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి అన్నారు. రోడ్ల నిర్మాణం కోరుతూ సోమవారం వై.రామవరంలో ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు. తొలుత బస్టాండు సెంటర్లోని అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. వై.రామవరం నుంచి పోతవరం మీదుగా గుర్తేడు వరకు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా అటవీ శాఖ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో నిలిచిపోయిందన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రంపచోడవరం డివిజన్‌లోని చవిటిదిబ్బలు, పందిరిమామిడి, చింతలపూడి, రాజవొమ్మంగి మండలం జడ్డంగి, లోదొడ్డి, అనంతగిరి, మారేడుమిల్లి మండలం ముసురుమిల్లి రోడ్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ నాయకులు గుడ్ల త్రిమూర్తులు, మదిగొండ వెంకటేశ్వర్లు, పుడిగి లక్ష్మణరావు, మేకా నర్సన్నదొర, గుడ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రణాళికతో ముందుకెళ్తేనే పంచాయతీల అభివృద్ధి'

రాజవొమ్మంగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా ముందకెళ్తేనే పంచాయతీలను అభివృద్ధి చేసుకోగలమని రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025-2026పై అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎల్పీవో నరసింగరావు, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందడంలో ప్రజాప్రతినిధులదే కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఆదిరెడ్డి

రంపచోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక పరిషత్ సంఘం నూతన అధ్యక్షునిగా కత్తుల ఆదిరెడ్డిని సోమవారం ఎన్నుకున్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు కంగల పోతురాజు, సమర్త కృష్ణ, బొగ్గుల కాటంరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా బొరగా పొట్టిదొరతో పాటు 60 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభ్యులతో ప్రమాణం చేయించారు.

భూముల సమస్యలను పరిష్కరిస్తాం: తహసీల్దారు సుబ్బారావు

ఎటపాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి భూ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కారం సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం పిచుకలపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని తునికిచెరువు, ఫెర్గుసన్‌పేట, మిడిపోర్‌పేట, పిచుకలపాడు గ్రామాల్లో భూసమస్యలపై పది దరఖాస్తులు అందాయి. వారసత్వ భూ పట్టాల మార్పిడికి చాలా మంది దరఖాస్తు చేసుకున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాలిపాడు, తునికలపాడు గ్రామాల్లో తహసీల్దారు వేణుగోపాల్ సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూమి సంబంధిత, పట్టాల్లో పేర్ల మార్పులు, మ్యుటేషన్లకు సంబంధించి వినతులు అందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు మంజూరు చేయాలి'

దేవీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం కోసం తక్షణం నిధులు మంజూరు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలానికి ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనికి పీవో స్పందిస్తూ ఈ విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు యలగాడ నాగేశ్వరరావు, ఎస్.మల్లిరెడ్డి పాల్గొన్నారు.



ఐటీడీఏ పీవోకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పనిచేయని బీఎస్ఎన్ఎల్ టవర్లు

వినియోగదారులకు ఇక్కట్లు

అడ్డతీగల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీఎస్ఎన్ఎల్ టవర్లు పనిచేయక పోవడంతో వినియోగదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి 24 గంటల పాటు సెల్‌ఫోన్లు పనిచేయలేదు. దీంతో సోమవారం ఉపాధ్యాయులు, ఉద్యోగులు అటెండెన్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేక అనేక కష్టాలు పడ్డారు. స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారి ఉండాలి. అయితే ఆయన స్థానికంగా ఉండని కారణంగా ఎక్స్ఛేంజ్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వినియోగదారులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి బీఎస్ఎన్ఎల్‌పై ఆధారపడ్డ వినియోగదారులు అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ సరఫరా ఉండనప్పుడు కూడా ఎక్స్ఛేంజ్‌లో జనరేటర్ ఆపరేట్ చేసే వ్యక్తి కూడా లేకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు దృష్టిసారిస్తే ఇప్పుడున్న వినియోగదారులైనా మిగులుతారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు




తుని మండలం ఎస్.అన్నవరంలో ధనుర్మాస పూజలో పాల్గొన్న భక్తులు, అన్నవరంలో సత్యదేవునికి వెండి పల్లకిలో గ్రామోత్సవం

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

తుని రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విష్ణాలయాలు ధనుర్మాస శోభను సంతరించుకున్నాయి. తుని పాత బజారు వీధిలోని శ్రీవెంకటేశ్వరస్వామి, ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, సూరవరంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. జనవరి ఒకటిన పూలంగి సేవ, శ్రీపుష్పయోగం, 3న తిరుప్పావడ సేవ, అన్నసమారాధన, సహస్ర దీపాలంకరణ, స్వామివారికి పంచహారతులు, గోపూజ జరుపుతారు. 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం, 11న పాయసం నివేదన, 12న అమ్మవారి సారె ఊరేగింపు, మంగళస్నానం, 13న భోగి పండుగ, గోదా రంగనాథుల దివ్య కల్యాణం, 14న మకర సంక్రాంతితో ధనుర్మాసోత్సవాలు ముగుస్తాయని ఆలయ వేద పండితులు చెప్పారు.

అన్నవరం (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా రత్నగిరివాసుడైన సత్యదేవునికి సోమవారం వెండి పల్లకిలో గ్రామ సేవను ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు గ్రామ ప్రధాన వీధుల్లో స్వామి, అమ్మవార్లు విహరిస్తారు. ధనుర్మాసంలో మహావిష్ణుస్వరూపుడైన సత్యదేవుడు తమ ఇంటికి వస్తుండడంతో గ్రామస్థులు, మహిళలు బియ్యం, పసుపు, కుంకుమ, అరటిపళ్లను నైవేద్యంగా సమర్పిస్తారు. మకర సంక్రమణం వరకు ప్రతి నిత్యం ఈ వెండి పల్లకి సేవను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు అంగర లక్ష్మీనరసింహాచార్యులు, వేదపండితులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేసిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించి ధనుర్మాస వేడుకలు ప్రారంభించారు. రాచపల్లిలోని అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరునికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ధనుర్మాస పూజలు జరిపారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణానికే నగర సంకీర్తన చేస్తున్నట్టు కత్తిపూడి వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ కేశంగి నూకరాజు అన్నారు. ధనుర్మాసం మొదటి రోజు సందర్భంగా శంఖవరం, కత్తిపూడి గ్రామాల్లో సోమవారం నగర సంకీర్తన ప్రారంభించారు. ఉదయం 4.30 గంటలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభమయ్యే నగర సంకీర్తన ఆరు గంటలకు తిరిగి చేరుకుంటుందన్నారు.





శంఖవరంలో నగర సంకీర్తన, ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో ప్రత్యేక అలంకరణలో అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరుడు, తుని మండలం ఎస్.సూరవరంలో భక్తులకు దర్శనమిచ్చిన గోదాదేవి



ఎమ్మెల్యే నెహ్రూకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

'హైందవ శంఖారావానికి రండి'

జగ్గంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనవరి ఐదో తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు రావాల్సిందిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆహ్వాన పత్రికను విశ్వహిందూ పరిషత్ జగ్గంపేట ప్రఖండ అధ్యక్షుడు పాబోలు సీతారామస్వామి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, అడబాల భాస్కరరావు, పాలచర్ల సత్యనారాయణ, అడబాల ఆంజనేయులు, జాస్తి వసంత్, ఉప్పులూరి పల్లయ్య, కొత్త నాగపండు, పీటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్లయర్ విడుదల చేస్తున్న దృశ్యం

వచ్చే నెల 4, 5 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

గండేపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్ విభాగంలో వచ్చే ఏడాది ఏప్రిల్ 4, 5 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు జరగనుందని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఐసీఏసీటీఈఏ పేరుతో జరగనున్న ఈ సదస్సులో ప్రస్తుత కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అత్యాధునిక అంశాలను చర్చించనున్నారు. సంబంధిత ఫ్లయర్‌ను డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి సోమవారం విడుదల చేశారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, రీసెర్చ్‌స్కాలర్స్, అధ్యాపకులు వారి పరిశోధనా అంశాలతో సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'పెళ్లి కానుక' అందజేత

జగ్గంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో మూడు జంటలకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ 'పెళ్లి కానుక'ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం అందజేశారు. గండేపల్లి మండలం తాళ్లూరుకు చెందిన సునీత రాణికి, జగ్గంపేటకు చెందిన రౌతు మౌనిక సింధూష, పిల్లి శ్రీదీపిక, కిర్లంపూడి మండలం గెద్దనాపల్లికి చెందిన వాసిరెడ్డి సూర్యనారాయణమ్మలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవన్ కుమార్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, సూరిశెట్టి వెంకటశివ, బీశెట్టి సూరిబాబు, ముల్లేటి గంగరావు, సూరిశెట్టి శ్రీను, పెతకంశెట్టి మల్లారావు, నెహ్రూ ఫౌండేషన్ కమిటీ సభ్యుడు గద్దె మారుతి తదితరులు పాల్గొన్నారు.



పెళ్లి కానుక చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు

జగ్గంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో సోమవారం రాజస్థాన్ మార్వాడీలు లక్ష్మీదేవి-సోగారం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు భరత్‌మాలి, కైలాష్ మాలి, రమేష్‌మాలి ఆర్థిక ససహాయంతో అన్న క్యాంటీన్ నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు సినీ వజ్రోత్సవ వేడుక నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, యల్లమిల్లి, రాజస్థాన్ మార్వాడీలు మోతీలాల్‌మాలి, చగన్‌లాల్ మాలి, జితేంద్రరాజ్, పురోహిత్, జయంతిలాల్ మాలి, మహేంద్రకుమార్ మాలి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

'పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

ఏలేశ్వరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాలాజీచౌక్ సెంటర్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. చాలా మంది అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా, జైలు శిక్ష

ప్రత్తిపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సర్కిల్‌లోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన ఆరుగురికి సోమవారం జడ్జి కాటం భాను రూ.10వేలు వంతున జరిమానా విధించారని సీఐ బి.సూర్యఅప్పారావు చెప్పారు. ఇదే కేసులో మరో వ్యక్తికి వారం జైలు శిక్ష విధించారు.

'రైతుల సమస్యలను పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి సాగునీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా కోరారు. మండలంలోని ధర్మవరం, గజ్జనపూడి సాగునీటి సంఘాలకు నూతనంగా ఎన్నికైన కమిటీలు, రైతులు సోమవారం ప్రత్తిపాడులో ఎమ్మెల్యేను కలిశారు. ధర్మవరం, గజ్జనపూడి గ్రామాల కూటమి నాయకులు బొల్లు కొండబాబు, బొల్లు సోమన్నదొర, దాకారపు కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు, కె.కొత్తపల్లి, చెల్లాయమ్మ చెరువు, తోట వెంకటాచలం ఎత్తిపోతల పథకం సంఘాలకు ఎన్నికైన ఆవాల సూరిబాబు, గొంప గంగరాజు ఎమ్మెల్యే సత్యప్రభను శాలువాతో సన్మానించారు.



నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులను అభినందిస్తున్న ఎమ్మెల్యే



రంగాకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

కాపునాడు కమిటీ నియామకం

తుని రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ కాపు సంఘం యువజన విభాగం ఉపాధ్యక్షుడు సూరపరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాపునాడు కమిటీ నియామకం జరిగింది. అధ్యక్షుడిగా యనుమల వెంకట మోహన్‌రంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ కాపు ముద్దుబిడ్డ వంగవీటి మోహన్‌రంగా ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని తెలిపారు.

రామానుజన్ గణిత పరీక్షలో ప్రతిభ

తుని రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామానుజన్ గణిత ప్రతిభా పరీక్షలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు తుమ్మలపల్లి హారిక (మూడవ తరగతి), లెక్కల సత్యరోషన్ (నాల్గవ తరగతి) జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. వీరిని శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ అభినందించారు.



జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన శ్రీప్రకాష్ విద్యార్థులు హారిక, రోషన్

'దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం'

ప్రత్తిపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని బీజేపీ గజ్జనపూడి ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని ఉత్తరకంచి, ఒమ్మంగి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన బీజేపీ సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్తరకంచి 71వ బూత్ అధ్యక్షుడిగా యూవీ రావు, 72వ బూత్ అధ్యక్షుడిగా సీరం ఉమామహేశ్వరరావు, ఒమ్మంగి 100వ బూత్ అధ్యక్షురాలిగా తేజోమూర్తుల ఉషారాణిలను నియమించి ధ్రువపత్రాలు అందజేశారు. మండల రిటర్నింగ్ అధికారి పతివాడ వెంకటేశ్వరరావు, వీఆర్వో రాయి గంగాధర్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు ఊటా వీరబాబు, రామకుర్తి సూర్యనారాయణ పాల్గొన్నారు.



ఉషారాణికి ధ్రువపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు

పాపికొండలుకు బోటు

దేవీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా రెండు రోజులు పాపికొండలు విహార యాత్రను నిలిపివేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని నిబంధనలు పాటించే పర్యాటక బోట్లకు సోమవారం అనుమతిచ్చారు. దీంతో పాపికొండలుకు యథావిధిగా 21 మంది పర్యాటకులతో బోటు వెళ్లింది.

టీడీపీ సభ్యత్వాల నమోదు

రంపచోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల శాఖ కార్యాలయంలో సోమవారం పార్టీ సభ్యత్వాలను నమోదు చేయించారు. నాయకులు అడబాల బాపిరాజు, పాటోజు సురేష్, పి.సూర్యనారాయణరాజు, కె.భీమార్జునరావు, విశాల్ పాల్గొన్నారు.



'రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి'

ప్రత్తిపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ ఎ.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని చింతలూరు, యుజేపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ తహసీల్దారు కె.పుణ్యవతి, ఎంఆర్ఐ గోపాలకృష్ణ, కూటమి నాయకులు జింకల తాతారావు, పంద్రాడ రాము తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

'అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు'

శంఖవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్టేట్ కో-ఆర్డినేటర్ కె.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన సీడీపీవో పద్మావతితో కలిసి మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కొన్నింటికి నూతన భవనాలు, కొన్నింటికి ప్రహరీలు అవసరమని, అంచనాలను సిద్ధం చేసి పంపాలని కోరారు. అరుణ, టి.గోవింద్, డి.రాజబాబు, టీపీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.